


# రమణ భాస్కర

## ఆధ్యాత్మిక పక్షపత్రిక

20-11-2004 (5)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమగోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 26-11-04 | శుక్ర | అరుణాచల దీపోత్సవము, తిరువన్నామలై |
| 28-11-04 | ఆది | పాతాళ మెరక |
| 01-12-04 | బుధ | చిన అమిరం, భీమవరం, సాయిబాబా గుడి వద్ద |
| 05-12-04 | ఆది | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపము |
| 06-12-04 నుండి 10-12-04 | | విశాఖపట్నం క్యాంపు |
| 07-12-04 | మంగళ | సీతమ్మధార, 50-26-10 ఎ, టిపిటి కాలనీ, మురళీ భవనము |

## సాధన లేనిదే - సిద్ధి లేదు

పోరాటంతో సాధించిన ఫలమే ఆనందాన్ని ఇస్తుంది. మానవ జీవిత లక్ష్యం ఆత్మసిద్ధిని పొందటమే. మన మీద మన మనస్సు అధికారం చెలాయించకుండా, ప్రతీక్షణం మన బుద్ధిని సారధిగా ఉపయోగించుకోవాలి. పరాకు రాకుండా ప్రతీ గదిలోనూ గురు రూపాన్ని నిలుపుకోవాలి. ఆత్మసిద్ధి ప్రయత్నం ప్రవాహంతోనే సాధ్యం అవుతుంది. ప్రయత్నహీనుడు గాడిదతో సమానం. "అదృష్టంతోనే అన్నీ సమకూరాలి, మన ప్రయత్నం ఏపాటిది?" అనుకొనే వాడిని చూడటానికి లక్ష్మీదేవి కూడా ఇష్టపడదు అంటారు. వైరాగ్యం అలవర్చుకొని అభ్యాసంతో ఇంద్రియాలను లోబరచుకొని సద్గురువు బోధలను ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి. బద్ధ జీవులంటే "మాయ" అనే వలను పురుష ప్రయత్నంతో ఛేదించుకొని బయటపడలేని వాడని అర్థం. నేను అంతా బాగున్నాను, నాకు అంతా తెలుసు, నేను మారవలసిన పనిలేదు అని చాలామంది అనుకొంటారు ఇది అంతా మనస్సే అంటోందని, మనలోని తప్పలను గుర్తించలేక మన దుఃఖానికి మనమే కారణం ఔతున్నాము. మన కోపతాపాలను ద్రష్టగా చూడటం చాలా కష్టమైన పని. ఇది భయం, ఇది స్వార్థం అని గుర్తించే స్థితికి రావాలంటే చాలాకాలం కష్టపడి ప్రయత్నం చేస్తేగాని రాదు, పైగా దానికి గురువు అనుగ్రహం తోడుకావాలి. దాటరాని ప్రకృతి సూత్రమే "విధి". విధినియమాలను సాక్షిగా చూడటం నేర్చుకొని ప్రశాంతంగా జీవిస్తే "సత్యం" దర్శనమౌతుంది. ప్రతీరోజు మనలో ఏ ఏ దౌర్భాగ్యపు తలంపులు వస్తున్నాయో గ్రహించి వాటిని నివృత్తిచేసుకోవటానికి మన మనస్సుకు మనమే ఇది తప్పని బోధించుకోవాలి. రామతీర్థులు ప్రతీ ఇంద్రియాన్ని ఇలా భయపెట్టేవారు "తప్ప పనికి ఉపక్రమించావా ఇదిగో కత్తి" అనేవారు. ఎందుకంటే దుశ్చరితులకు, అశాంతి మనస్సులకు "సత్యజ్యోతి" ఎన్నటికీ కానరాదు. "కృషి, నిరంతర కర్మనిష్ఠ, పరిశ్రమ, తీవ్రసాధన, కార్యసిద్ధికి కీలకమన్న విషయం, నిగూఢ సత్యం. సోమరిపోతు జీవిత సంగ్రామంలో నలిగిపోయి నశిస్తాడు" అన్నారు శ్రీరామతీర్థ. కాబట్టి సాధనలేకపోతే మనస్సు బహిర్ముఖమై బంధంలో చిక్కుకొంటుంది. సిద్ధిలేదు.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం



ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 10 సంచిక : 5 పుష్పం : 11-12 20-11-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 10 ISSUE : 5

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETHRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401 - 31188

## జీవ విచారము

మహాభారత యుద్ధమునందు గురువులయిన భీష్మద్రోణాదులను వధించుటకు మనస్సంగీకరించక మనసు వికలము చెందిన అర్జునుడు యుద్ధము చేయుటకు విముఖుడై ధనుర్బాణములను వదలి రధముపై చతికిలబడి యుద్ధము చేయనని దుఃఖించుచుండగా శ్రీకృష్ణుడు అర్జునుడిని యుద్ధోన్ముఖుడను గావించుటకు ఎన్నో విధములుగా ప్రయత్నించాడు. చచ్చేదేదియో, చావనిదేదియో విచారణ పూర్వకంగా నచ్చచెప్పినగాని అర్జునుడు అంగీకరింపడు. దుఃఖాతిశయముతో నున్న అర్జునుడితో,

"అశోచ్యా నన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః"

తాను జీవించియుండగ చచ్చినవారికొరకుగాని, తాను మరణించునపుడు చావనివారికొరకుగాని పండితులెప్పడు దుఃఖింపరు అంటూ ప్రారంభించి ఆత్మ యొక్క నిత్యత్వము, దేహము యొక్క అనిత్యత్వము అనేక విధములుగ నిరూపణ చేసి చెప్పచూ, అజ్ఞాని దేహము యొక్క జనన మరణములను తనయందారోపించుకొని శోకమోహములకు లోనగునని వివరించాడు.

జీవుడు దేహమును విడిచి వేరొక దేహమును పొందునప్పడు,

ఈ సంచికలో..... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 28-10-04 | నర్సాపురం | 3 |
| 07-11-04 | జిన్నూరు | 9 |

అనగా మరణించి మళ్ళీ కొత్త జన్మ ఎత్తునప్పుడు పుష్పములనుండి వాయువు వాసనలను తీసుకొనివెళ్ళు విధంగా, మనస్సును, అయిదు జ్ఞానేంద్రియములను వెంట తీసుకొని వెళ్ళును. నూతన శరీరము పొందినప్పటికి అచ్చటకూడా ఈ ఇంద్రియములు, ఈ మనస్సు, ఈ కర్మ వాసనలే ఉంటాయి. జ్ఞానదృష్టి కలిగిన తత్త్వవేత్తలు మాత్రమే ఈ విషయమును గుర్తించగలుగుతున్నారు.

జీవుడు పురుషుడు కాదు, స్త్రీకాదు, నపుంసకుడు కాదు. ఏయే దేహములందు ప్రవేశించుచున్నాడో ఆయా దేహములతో సంబంధము కలవాడగును. సంకల్పముచేత, అభిలాషచేతను, అన్నపానములచేతను శరీరాభివృద్ధి కలిగి కర్మలను చేస్తూ ఆయా కర్మాను గుణముగ శరీరములను దాల్చుచున్నాడు. కర్మచేసి దాని ఫలమునే అనుభవించు చున్నాడు. కర్మానుసారముగ ఏ ఉపాధి ప్రాప్తించిన దానితోనే తాదాత్మ్యమునొంది, సుఖదుఖములనుభవించుచు, సంసారమునందు వైరాగ్యముపొందక జననమరణ చక్రమునందు తగుల్కొని తిరుగాడుచుండును. అదే జీవుని స్వభావము.

జీవుడు తగిన సాధన సంపత్తిని సంపాదించి జ్ఞానియైనప్పుడు సహజముగానే అజ్ఞానము నశించును. అజ్ఞానము నశించగానే అంతకు పూర్వము అజ్ఞానముతో కలిగిన అంతఃకరణము కూడా నశించును. అవిద్యకు సంబంధించినవి నశించగానే కేవల అనుభవానంద స్వరూపుడుగా, సచ్చిదానంద స్వరూపుడుగా, కేవలుడుగ అహంబ్రహ్మాస్మి భావన కలుగుతుంది. దుర్మార్గము నుండి మరలనివాడు, ఇంద్రియనిగ్రహము లేనివాడు, ఏకాగ్రచిత్తము లేనివాడు, మనస్సు లయించనివాడు ఆత్మను పొందలేడు. ప్రజ్ఞానము చేత మాత్రమే ఆత్మను తెల్సుకోగలడు జీవుడు. పరమాత్మను పొందటానికి, తెల్సుకోవటానికి శాస్త్రములందు అనేక సాధనలు చెప్పబడ్డాయి.

"ప్రథమం ప్రతిమా పూజా జపస్తోత్రాణి మధ్యమా
ఉత్తమా మానసే పూజా సోహం పూజోత్తమోత్తమా"

విగ్రహారాధన ప్రథమసోపానం కాగా జపము, కీర్తనం, స్తోత్రములు మధ్యమము. మానసపూజ ఉత్తమము. ఆత్మానుసంధానము ఉత్తమోత్తమము. హృదయమునందున్న కోరికలన్నియు వాసనలతోసహా జీవుడిని ఎప్పుడు వదిలిపోవునో అప్పుడే జీవుడు అమృతుడై, పరబ్రహ్మమును పొందును.

**- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-10-04, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు తన శరీరాన్ని ఎలా చూసుకొంటాడో భక్తుల శరీరాలను కూడా అలాగే చూసుకొంటాడు. అది మనం బాబా జీవితంలో చూస్తాము. బాబాగారు ఒకోరోజున పదిసార్లు కూడా బిక్ష చేసేవారు అదంతా ఆయనకోసం కాదు, భక్తులకోసం. ఒక మనిషికి ఎంత ఆప్యాయంగా పెట్టేవారో ఆయన దగ్గర ఉన్న జంతువులకు కూడా అంతే ఆప్యాయంగా పెట్టేవారు. భక్తులు ఎవరైనా చనిపోతే స్మశానానికి కూడా వెళ్ళేవారు, బంధువులు ఏడ్చినట్లు ఆయన కూడా ఏడ్చేవారు. భక్తులమీద ఆయనకు ఉన్న ప్రేమ అట్టిది. మనదేశంలో ఆత్మజ్ఞానం పొందినవారు చాలామంది ఉన్నారు. కాని భక్తుల మీద అపారమైన కరుణ, హద్దులులేని ప్రేమ, భక్తులకోసమే జీవించటం వలన ఆయన పాపులర్ సెయింట్ అయ్యారు. రమణమహర్షిగారు ఎలా అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళలేదో అలాగే బాబాగారు కూడా షిరిడీ విడిచిపెట్టి వెళ్ళలేదు. బాబాగారు ఎక్కడ పుట్టారో, ఏ మతమో, ఏ కులమో ఎవరికీ తెలియదు. కాని ఎప్పుడైనా ఎవరైనా మీ మతం ఏమిటని అడిగితే కబీరుమతం అనేవారు. ఆయనకు కబీర్ అంటే ఇష్టం. బాబా షిరిడీకి రావటమే ఆస్థలం యొక్క పుణ్యం. షిరిడీ సహజంగా పుణ్యక్షేత్రంకాదు. బాబాగారు రావటంవలన షిరిడీ పుణ్యక్షేత్రం అయ్యింది. బాబా ఒక అడవిలో ఉండేవారు. ఆయనకు భయం ఎలా ఉంటుందో తెలియదు. ఎవడైతే నిరంతరం ముక్తిస్థితిలో ఉంటాడో వాడే భయరహితుడు అవ్వగలడు. సాయి అంటే సర్వానికి అతీతుడని రామకృష్ణ పరమహంస చెప్పారు. బాబాగారుచాలాకాలం వేపచెట్టుకింద కూర్చునేవారు. దానిని గురుస్థానం అనిపిలుస్తారు. ఎంత చలిగాలి వేసినా ఏమీ కప్పుకొనేవారు కాదు. ఎంతవేడిగా ఉన్నా వేపచెట్టుని వదలి వెళ్ళటానికి ప్రయత్నం చేయలేదు. చలిని, వేడిని సహజంగా తట్టుకొనేవారు. పగలు ఎవరైనా వస్తే తగుమాత్రంగా మాట్లాడేవారు, రాత్రి ఒంటరిగానే ఉండేవారు. ఎక్సరే తీసినప్పుడు మనకు రోగం ఉందో, లేదో ఎలా తెలుస్తుందో అలాగ మనం ఒంటరిగా ఉన్నప్పుడు మన మనస్సు ఎలా పనిచేస్తోందో మనకు తెలుస్తుంది. దానినిబట్టి మనం సాధనచేసి మనలోని బలహీనతలను తొలగించుకోవాలి.

బాబా తత్వశాస్త్రాలు అవీ చెప్పేవారు కాదు. ఒకో గురువు ఒకో పద్ధతిలో చెపుతారు, లోపల జ్ఞానం సమానమే. జ్ఞానం వచ్చినంతమాత్రంచేత చెప్పే విధానం మారదు. జ్ఞానం వచ్చాక జ్ఞానానికి సంబంధించిన మాటలు మాట్లాడతారు, చెప్పే విధానంలో ఎవరి వైభవం వారిదే, ఇందులో ఒకరితో ఒకరిని పోల్చుకోకూడదు. బాబాగారు ఎక్కువగా రెండు మాటలు చెప్పేవారు. 1. విశ్వాసం, 2. సహనం. ఎట్టిపరిస్థితులలో ఈశ్వరునిపట్ల విశ్వాసం విడిచిపెట్టకూడదు. జీవితంలో సహనంగా ఉండాలి. సహనం వలన చాలాసమస్యలు పరిష్కారమవుతాయి. నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. మంచితలంపులు ఉన్నవారికి చెడుతలంపులు రావచ్చు, చెడుతలంపులు ఉన్నవారికి మంచితలంపులు రావచ్చు, ఇలా తలంపులు మారవచ్చునుకాని నేను, నాది అనే తలంపులను పోగొట్టుకోవటం చాలా

కష్టం. ఇవిచాలా గాఢంగా ఉంటాయి. ఈ తలంపులలో నుండి విడుదలపొందాలంటే దానికెంతో సాధన చేయాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి, మోక్షం పొందాలనే తపన ఉండాలి, నేను నాది అనే తలంపుల నుండి విడుదలపొందాలనే కాంక్ష నీహృదయంలో నుండి పెల్లుబికిరావాలి. మీకెవరికైనా దుఃఖం వస్తూఉంటే, అశాంతి వస్తూఉంటే, వేదన రోదన వస్తూఉంటే వాటికి కారణం ఏమిటని చూస్తే ఈ రెండుతలంపులలో ఏదోఒకటి అయిఉంటుంది. మనకు నేను అనేటప్పటికి దేహం స్ఫురిస్తుంది అంటే ఈ నేను దేహాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. దేహం చనిపోయినప్పడు నేను చనిపోతున్నాను అని అనుకొంటుంది కాని అది చనిపోవటం లేదు. దేహాన్ని అంటిపెట్టుకొని ఉండటం వలన అలా అనుకొంటుంది. ఈ దేహం చనిపోయినా మరల కొత్తదేహం వచ్చిన తరువాత దానిని అంటిపెట్టుకొని ఉంటుంది. ఈనేను, నాది అనే తలంపులు ఉన్నంతసేపు చనిపోవటం, పుట్టటం తప్పదు. ఈ సంసారం మనలను విడిచిపెట్టదు. బాబాగారు ఏమీ బోధచేయలేదు అని కొంతమంది అంటారు. ఆయన అసలు చెప్పకుండా లేరు, సందర్భాన్ని బట్టి నాలుగుమాటలు చెప్పేవారు. నేను అనే తలంపుకు నష్టం వస్తోంది అనుకోండి మనకు భయం వస్తుంది. నాది అనే తలంపుకు నష్టం వస్తోంది అనుకోండి మనకు భయం వస్తుంది. నేను, నాది అనే తలంపు లేనివాడికి భయంలేదు, అశాంతి లేదు, ఏమీలేదు. వాడికి, వాడు వాడుగా ఉంటాడు. ఈ నేను, నాది అనే తలంపుల నుండి విడుదలపొందితేనేగాని శాంతిలేదు, సుఖంలేదు, ఆనందం లేదు, వాటిలోనుండి విడుదలపొందటం మీదే నీ సాధన అంతా గురిపెట్టాలి.

దత్తాత్రేయుడి అవతారమే షిరిడీబాబా అని కొంతమంది విశ్వాసం. దత్తాత్రేయుడి తల్లిపేరు అనసూయ, తండ్రి పేరు అత్రిమహర్షి. అనసూయ గొప్ప పతివ్రత. ఒకసారి త్రిమూర్తులు అనసూయను పరీక్షించటం కోసం వెళతారు. వారు వచ్చేసరికి అత్రిమహర్షి నదీతీరానికి వెళతాడు. వచ్చినవారు త్రిమూర్తులు అని అనసూయకు తెలియదు. అనసూయను భోజనం పెట్టమని అడుగుతారు. భోజనం పెడతానని అనసూయ చెపుతుంది. భోజనం నగ్నంగా పెట్టమని అంటారు త్రిమూర్తులు. అప్పడు అనసూయ మనసులో భగవంతుడికి, అత్రిమహర్షికి నమస్కారం పెట్టి భోజనం వడ్డించటానికి త్రిమూర్తులు ఉన్నచోటకు వస్తుంది, అప్పడు వారు చిన్న పిల్లలుగా అయిపోతారు. అప్పడు అత్రిమహర్షి వస్తాడు. వీరు సామాన్యులుకాదు, త్రిమూర్తులు అని తెపుతాడు. అప్పడు త్రిమూర్తులు అత్రిమహర్షిని, అనసూయను మీకు ఏమికావాలో కోరుకోండి అని అడుగుతారు. మీరు లోకకళ్యాణం కోసం పనిచేస్తున్నారు. ఆ మంచి పనిని కంటిన్యూచేసే బిడ్డను ప్రసాదించమని అత్రిమహర్షి అడుగుతాడు. అత్రిమహర్షి వైభవం చూడండి ఆయన డబ్బు అడుగలేదు, గౌరవం అడుగలేదు, లోకానికి సంబంధించినది ఏదీ అడుగలేదు. భగవంతుడు అంతటా ఉన్నాడు, అందరిలోను ఉన్నాడు. మిమ్మల్ని విడిచిపెట్టి మేము లేము, కాని మా అహంభావన మీతో మాకు వేరుతనాన్ని తీసుకొనివస్తోంది, ఆ వేరుతనాన్ని పోగొట్టమని అత్రిమహర్షి త్రిమూర్తులను ప్రార్థించాడు. త్రిమూర్తుల అంశవలన అనసూయకు జన్మించిన పుత్రుడే దత్తుడు. పరశురాముడి గురువు దత్తాత్రేయుడు. దత్తాత్రేయుడు పరశురాముడికి ఆత్మబోధ చేసాడు. ఆబోధ అంటే రమణమహర్షిగారికి ఇష్టం.

షిరిడీ వచ్చేవారు అందరూ అదృష్టవంతులే. నేను నా సమాధిలోనుండి కూడా పనిచేస్తూ ఉంటాను అని బాబా చెప్పారు. బాబాగారి శరీరం ఉన్నప్పుడు ఎటువంటి మహిమలు జరిగినవో అటువంటి మహిమలు ఇప్పడు కూడా జరుగుతున్నాయి. అది శుద్ధ చైతన్యం. అక్కడ శరీరం ఉండటం, లేకపోవటం కాదు. సాధన చేసి దేహాత్మబుద్ధి నశింపచేసుకొన్నవాడికి దుఃఖం లేదు, వేదన లేదు, చావు కూడా వాడిని ముట్టుకోదు. అదే జ్ఞానియొక్క వైభవం.

మనం సుఖాన్ని పొందటానికి, శాంతిని పొందటానికి, దుఃఖరహితస్థితిని పొందటానికి మనం ఆత్మజ్ఞానం సంపాదించాలి. మనం లెక్కలు, సైన్స్, చరిత్ర ఇవిఅన్నీ ఎలా నేర్చుకొంటున్నామో అలా ఆత్మవిద్యను కూడా అభ్యసించాలి. ఎవడైతే ఆత్మవిద్యను అభ్యసించాడో వాడు మాత్రమే అజ్ఞానంలో నుండి విడుదల పొందుతాడు. సదాచారం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు అని బాబా చెప్పారు. హద్దులు లేని ప్రేమతో భక్తులను బాబా ప్రేమించారు, వారి మొఖాన్ని ఆత్మజ్ఞానం వైపు మళ్ళించారు. కష్టపడి పనిచేసే వారికి దారిద్ర్యం ఉండదని, నిరంతరం భగవంతుని నామాన్ని జపించేవారికి పాపం ఉండదని చెపుతారు. భక్తుల యొక్క ఆధ్యాత్మిక అభివృద్ధేకాదు, భౌతికఅభివృద్ధి కూడా బాబా చూసేవారు. బాబాగారి భక్తుడికి ఒక పెద్ద కురుపు వేసింది. ఆ కురుపు వలన వచ్చే బాధను పడలేకపోతున్నాడు. నేను ఏదో పాపం చేసి ఉంటాను అందువలన ఈ బాధ వచ్చింది. నేను చేసిందే నాకు వస్తుంది అని చెపుతున్నారుకదా, ఆబాధను నేను అనుభవించాలి కదా, అందువలన ఆ బాధను తీసెయ్యమని నేను అడగటం లేదు, ఒకే జన్మలో ఇంత బాధ పడలేకపోతున్నాను, ఈ బాధను రాబోయే పదిజన్మలకు పంచిపెట్టు బాబా అని అడుగుతాడు. ఏమిటీ పదిజన్మలలో ఈ బాధ పడతావా, ఈ బాధను పది రోజులలో పోగొడతాను నువ్వు అలా కూర్చో అని బాబా చెప్పారు. ఇంతలో మసీదు తుడిచేవాడు వచ్చాడు, వాడు తుడుస్తూ కంగారులో ఆ కురుపు మీద కాలు వేసాడు. ఆ కురుపు చితికిపోయి చీము అంతా బయటకు వచ్చేసింది. ఎంత బాధ బాబా అన్నాడు ఆ భక్తుడు. నీకు సర్జరీ అయిపోయింది, పదిజన్మలకు బాధను పంచమన్నావు, పదిరోజులలో తగ్గిపోతుంది అని బాబా చెప్పారు, అది జ్ఞానియొక్క వైభవం. నేను గొప్పవాడిని అని చెప్పకొనేవాడి దగ్గర అసలు మీరు కూర్చోవద్దు అని బాబా చెప్పారు ఎందుచేతనంటే ఆ అలవాట్లు అన్నీ మనకు వచ్చేస్తాయి. రోజురోజూ కోపం వస్తూ ఉంటే మీరెలా చక్కబడతారు. మీ సుఖం కోసం, శాంతి కోసం అయినా కోపం తగ్గించుకోండి అని బాబా చెప్పారు. కోపం పెరుగుతూ ఉంటే తెలివితేటలు తగ్గుతాయి.

సత్పురుషుడికి మనం చెడ్డ చేసినా వాడు మనకు మంచే చేస్తాడు, అది సత్పురుషుల లక్షణం. ఒక మంచివాడే ఆ పని చేసినప్పడు, భగవంతుడికి మనం అపచారం చేసినా ఆయన మోక్షం ఇవ్వకుండా ఎలా ఉంటాడు. భగవంతుడు చెప్పిన మాటకు విరుద్ధంగా మనం పొరపాటున జీవించినా, ఆయన పాదాలను ఆశ్రయిస్తే మోక్షం ఇవ్వకుండా ఎలా ఉంటాడు. భగవంతుని పాదాలను ఆశ్రయించండి. ఎట్టి పరిస్థితులలోను భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు, మీకు కావలసిన సుఖం, శాంతి, ఆనందం అక్కడే ఉన్నాయి. భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీలేదు, ఆయన పాదాలను ఆశ్రయిస్తే మనకు అన్నీ

సమకూరుతాయి. విషయాలు ముందు ఇంద్రియాలలోనికి రావు, ముందు మనస్సులోనికి వస్తాయి. కళ్ళకు ఆహారం రూపం, చెవికి ఆహారం శబ్దం, నాలుకకు ఆహారం రుచి, ముక్కుకు ఆహారం వాసన, సినిమాను చూడాలనే తలంపు మనస్సుకి వస్తుంది. సినిమాను కళ్ళు చూస్తాయి, కాని తలంపు కళ్ళకు రాదు, మనస్సులో తలంపు వస్తుంది. మనస్సుకు తలంపు రాకుండా కన్ను సినిమా చూడదు. నిరంతరం ఆ మనస్సుకు భగవంతుడి రూపాన్నీ, నామాన్నీ ఇచ్చి ధ్యానం చేస్తూ ఉంటే మనస్సుకు ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చే అలవాటు తగ్గిపోతుంది. ప్రపంచాన్ని సృష్టించి భగవంతుడు పారిపోలేదు, ఆయన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు, అంతటా వ్యాపించి ఉన్నాడు, ఈ జీవకోటిని నియమిస్తున్నాడు. నీకు భక్తిలేకపోతే ఆయన దొరకడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. నిరంతరం నీ బుద్ధిని భగవంతుడి వైపు సమాయత్తం చేయటం వలన నీకు విషయచింతన తగ్గిపోతుంది. విషయచింతన తగ్గిపోతే పునర్జన్మలు తగ్గిపోతాయి.

చావు పుట్టుకలు అన్నీ అహంకారానికే, లోపల ఉన్న చైతన్యానికి చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు, అది నీవై ఉన్నావు. దాని తాలుక అనుభవం తీసుకొనిరావటమే గురువు చేసే పని. నేను కొన్ని మహిమలు చేసి చూపిస్తున్నాను కాని అది గమ్యం కాదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మీకు కలిగించటానికి, భగవంతుడిలో మిమ్మల్ని ఐక్యంచేయటానికి ఆపనులు చేస్తున్నానుగాని చమత్కారాల కోసం చేయటం లేదు అని బాబాచెప్పేవారు. సంతృప్తి కలవాడే ధనవంతుడు. కొంతమందికి తృప్తి ఎలా ఉంటుందో తెలియదు. భగవంతుడు ఏదైతే మనకు కేటాయించాడో అదే మనకు వస్తుంది, దానికి తృప్తిపడకపోతే భగవంతుడి పట్ల మనకు గౌరవం లేదు అని అర్థం. ఇంటి దగ్గర ఏవో చిన్న చిన్న సమస్యలు వస్తూ ఉంటాయి, వాటికోసం మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు అని బాబా చెప్పారు. ప్రతీ చిన్నవిషయానికి మీరు ఉద్రేకపడుతూ ఉంటే మీరు మోక్షమార్గాన్ని తప్పిపోతారు, దేనిని పొందటంకోసం ఈ శరీరం భూమి మీదకు వచ్చిందో దానిని మిస్ అయిపోతారు. సాధకులు సోమరితనంగా ఉండకూడదు, భగవదనుభవం పొందటానికి నిత్యకృషీవలులవలె ఉండాలి. ఇతరచింతనలు చేయటానికి మీకు టైము ఉండకూడదు. మాటలో, చేతలో, మనస్సులో భగవంతుని చింతనే ఉండాలి. మీరు ఎవరితోను శత్రుత్వాలు పెట్టుకోవద్దు అని బాబా చెప్పారు. శత్రుత్వాలు పెట్టుకొంటే అవి రాబోయేజన్మలో కూడా కంటిన్యూఅవుతాయి అని చెప్పారు. సత్పురుషుల సహవాసం విడిచిపెట్టవద్దు. సత్సాంగత్యం హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి సహాయపడుతుంది. ఏవయసులో పని ఆవయసులో చేసుకోవాలి. కొంతమంది ముసలితనం వచ్చాక భగవంతుడిని స్మరించుకొందాము అనుకొంటారు. మీ శరీరం దేనికీ పనికిరానప్పుడు, ఇంట్లో వారందరు నీవు వల్లకాటికి వెళ్ళిపోతే బాగుండును అనుకొంటున్నప్పుడు నీకు భగవంతుడు కావాలా? ఆ టైములో భగవంతుని స్మరణ సాధ్యమవుతుందా? అలా కాదు మీరు వయసులో ఉండగానే, శరీరం అన్నిరకాలుగా బాగున్నప్పుడే మీరు భగవంతుడిని పట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి అని బాబా చెప్పేవారు. దానికోసమే ఆచార్యులవారు భజగోవిందం శ్లోకం చెప్పారు.

భజగోవిందం శ్లోకం ఏ సందర్భంలో చెప్పారు అంటే ఆచార్యులవారు ఒకరోజు కాశీలో గంగానదిలో స్నానంచేసి వస్తూఉంటే 70 సం॥ల ముసలివాడు అరుగుమీద కూర్చొని వ్యాకరణసూత్రాలు బట్టీపడుతున్నాడు. ఆ ముసలివాడిని చూసి ఆచార్యులవారికి జాలి కలిగింది. అతని దగ్గరకు వెళ్ళి నీకు ఈ వయస్సులో వ్యాకరణసూత్రాలు ఎందుకు? నువ్వు గోవిందుడిని స్మరించుకొని తరించు. మధ్యవయస్సులో నీవు భగవంతుడిని ఎలాగూ ప్రార్థన చేయలేదు కనీసం ముసలివయస్సులో అయినా నీ మనస్సు భగవంతుడిని ప్రార్థించటం లేదు, వ్యాకరణసూత్రాలవైపు మళ్ళుతోంది.

నువ్వు సత్పురుషుల సహవాసం చెయ్యి. సత్పురుషుల సహవాసం వలన మనకు లోకంమీద ఉన్న మోహం తగ్గుతుంది. లోకంమీద మోహం ఎప్పుడైతే పోయిందో అప్పుడు నీకు అశాంతి పోతుంది, నీకు స్థిరబుద్ధి కలుగుతుంది, స్థిరబుద్ధి ఎప్పుడైతే కలిగిందో నీవు జీవన్ముక్తుడవు అవుతావు అని చెప్పారు. ధర్మాన్ని ఆచరించండి. ధర్మం ఒక వంతెనలా మనకు ఉపయోగపడుతుంది. మనం ఈప్రక్కన సంసారంలో ఉన్నాము. ఆప్రక్కన మోక్షం ఉంది. ధర్మమే గమ్యం కాదు. కాని ధర్మాన్ని ఆచరించటం వలన ఈప్రక్క నుండి ఆప్రక్కకు చేరటానికి అది వంతెనలా మనకు ఉపయోగపడుతుంది. మీరు పనిదొంగలు అవ్వవద్దు. భగవంతుడు మీకు ఏపని అయితే కేటాయించాడో ఆపనిని శ్రద్ధగా చేయండి. ఒక భక్తుడు బాబాగారితో అక్కడ పాము కప్పని మింగేస్తోంది, అది చాలా పొగరుగా ఉంది మీరు అక్కడకు వెళ్ళవద్దు అని చెప్పాడు. బాబాగారు అక్కడకు వెళ్ళి ఒరే వీరప్పా (పూర్వజన్మలో ఆ పాము పేరు) మీరు నాలుగు జన్మల నుండి శత్రుత్వంలో ఉన్నారు. ఇంకా ఎన్నిజన్మలు ఈశత్రుత్వం అని తిట్టారు. ఆ కప్పపేరు సత్తెప్ప, దానిని కూడా తిట్టారు. అప్పుడు ఆ పాము కప్పను వదిలేసి వెళ్ళిపోయింది. కప్పకూడా ప్రక్కకు వెళ్ళిపోయింది. అవి మూడు జన్మల నుండి శత్రుత్వంలో ఉన్నాయి, ప్రతీవారితో శత్రుత్వం పెట్టుకొంటే మీ పనికూడా అంతే అని బాబా భక్తులతో చెప్పారు. ఎవరితోనైనా శత్రుత్వకారణం ఉన్నా శత్రుత్వం పెట్టుకోవద్దు, దానివలన మీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, మీరు పాడైపోతారు అని బాబా చెప్పారు. భగవంతుడు లేకపోతే ఏ గొడవ లేదు, ఒకవేళ ఉన్నాడు అనుకోండి వాడిని ఎందుకు గౌరవించాలి? ఎందుకు ప్రేమించాలి? అని ఒకరు త్రైలింగస్వామిని అడిగారు. మీ అమ్మను, నాన్నను గౌరవించినప్పుడు మరి భగవంతుడిని గౌరవించకుండా ఉంటావా? ఈ జీవకోటి అంతా ఏ భగవంతుడిలో నుండి వచ్చిందో ఆయనను గౌరవించు. మీ అమ్మను, నాన్నను గౌరవించేటప్పుడు వారిని సృష్టించిన ఈశ్వరుడి యందు నీకు గౌరవం అక్కరలేదా? భక్తి అక్కరలేదా? అన్నారు.

సత్యాన్వేషణకు కర్మతో కూడిన జీవితాన్ని సన్యసించనక్కరలేదు అన్నారు భగవాన్. భగవంతుడు నీకు కేటాయించిన పనిని ఇష్టంతో, ప్రేమగా చెయ్యి. భగవాన్ ఎప్పుడూ గృహస్థుకు, సన్యాసికి బేధం చూడలేదు. అక్కడ బట్టలు ప్రధానం కాదు, మనస్సు ప్రధానం. మనం వ్యక్తిభావనను విడిచిపెట్టాలి. మనం పనిచేసేటప్పుడు తెలివిగా, వివేకంతో చేయాలి. ఎవరైనా మిమ్మల్ని తిట్టారు అనుకోండి ఆ రియాక్షన్‌తో పనిచేయకండి, అది పాపాన్ని తీసుకొనివస్తుంది. నీవు చేసేపని శాంతిగా చెయ్యి, ఉద్రేకంగా చేయవద్దు. ఉద్రేకంగా చేయటం

వలన మనం ఏదైతే పోగొట్టుకోవాలో అది బలపడిపోతుంది. ఉద్రేకం వచ్చినప్పుడు మౌనంగా ఉండటం మంచిది. గాంధీగారు దేశానికి చాలా సేవ చేసారు, దేశం ఏమైనా బాగుపడిందా అని ఒకరు చలంగారిని అడిగారు. దేశం బాగుపడిందా లేదా ఆ గొడవ వదిలెయ్యి. దేశానికి సేవచేసి గాంధీగారు మహాత్ముడు అయిపోయాడు అన్నారు చలంగారు. నీ డ్యూటీ ఏదో అది సక్రమంగా చెయ్యి, ఎదుటివారి క్షేమం కోరి, రాగద్వేషములు లేకుండా చెయ్యి. వారు బాగుపడతారా లేదా అనేది తరువాత విషయం. అలాపనిచేయటం వలన నీవు ఉద్ధరింపబడతావు. రాగద్వేషములే మనస్సును బాహ్యముఖానికి తీసుకొని వచ్చేవి. వాటిని నీ అంతట నీవు ప్రయత్నం చేసి తొలగించుకోలేవు. అంతర్యామిగా ఉన్న నారాయణుడిని స్మరించగా స్మరించగా, ఆయనను సేవించగా సేవించగా నీ మనస్సులో ఉన్న దోషాలను, రాగద్వేషాలను నాకుతాడు అని వైష్ణవ సాంప్రదాయంలో చెపుతారు. సత్కర్మ ద్వారా మన మనస్సు పరిశుద్ధం అవ్వాలి. పవిత్రత లేనివాడికి పరమార్థం అందదు. మనస్సు ఉదయించినప్పడే నీకు సృష్టి కనబడుతోంది, మనస్సు లేనప్పుడు సృష్టిలేదు. మాయ అంతా మనస్సులోనే ఉంది. మనస్సు ఉంటేనే నీకు భయం, కోరిక, ఇష్టం, అయిష్టం, అశాంతి ఇవన్నీ. అమనస్కస్థితిని పొందేవరకు ఏదో భయం, ఏదో అశాంతి నిన్ను వెంటాడుతూనే ఉంటాయి.

ఏ విషయాలు అయితే నిన్ను లోకానికి, దేహానికి బంధిస్తున్నాయో వాటిని త్యజించకుండా నీకు జ్ఞానం కలిగే అవకాశం లేదు అని రమణస్వామి చెప్పారు. మనకు దుఃఖం వస్తోంది అంటే కారణం దేహభ్రాంతే. దేహభ్రాంతి లేనివాడికి దుఃఖం లేదు, వాడు చావుని కూడా చూడడు. సన్యాసం అంటే బట్టల రంగు మార్చటం కాదు, దేహగతమైన నేనును విడిచిపెట్టటమే నిజమైన సన్యాసం. మనం చేస్తున్న పని నిర్మలంగా, నిశ్చలంగా, ఏకాగ్రంగా చేయాలి. అది జ్ఞానసముపార్జనకు సహకరించేదిగా ఉండాలి. యజ్ఞభావనతో పనిచేయమని గీతలో పరమాత్మ చెప్పాడు. ఎక్కడైనా మనకు అవమానం జరిగితే దానిని అమృతంగా భావించాలి. మనకు సన్మానం జరిగితే దానిని విషంగా భావించాలి ఇది సాధకుడి లక్షణం అని బాబా చెప్పారు. ఉన్నది భగవంతుడే, అంతా ఆయనే, చెడూ ఆయనే, మంచీ ఆయనే. ప్రపంచంలో చెడు జరుగుతోంది అంటే అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు, దాని ప్రయోజనం కూడా ఏదో ఉంటుంది. దాని ప్రయోజనం కూడా ఉంది కాబట్టే ఆ చెడు జరగటానికి భగవంతుడు అంగీకరిస్తున్నాడు, అది భక్తుడు గ్రహించాలి. లోకంలో ఇష్టాలు, అయిష్టాలు, హెచ్చుతగ్గులు, గొప్పలు, తిప్పలు అన్నీ ఉంటాయి. వాటిని చూడవద్దు. నీవు లోచూపు అలవర్చుకోవాలి. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. ద్వారకామాయిలో బాబా ధుని వెలిగించారు. ఈ ధుని ఎందుకు అని కొందరు భక్తులు అడుగుతున్నారు. కట్టెలు కాలిన తరువాత బూడిద వస్తుంది. బాబా ఉద్దేశం ఏమిటి అంటే మనం ఈ ధనాన్ని, అధికారాన్ని, అందాన్ని, పదవులను చూసి మురిసిపోతున్నాము కాని చివరకు మీరు అయ్యేది కూడా బూడిదేరా పిచ్చివాళ్ళలారా అని మనకు చెప్పటంకోసం బాబాగారు ధుని వెలిగించారు. బాబా దగ్గరకు మనం వెళ్ళాము అనుకోండి ఆయన ఏ స్థితిని పొందారో ఆస్థితిని మనం పొందటం కోసం ఏదోషాలు అడ్డువస్తున్నాయో వాటిని ధునిలో పెట్టికాలుస్తారు బాబా.

మనకు పొలాలు ఉంటే, బ్యాంకులో లక్ష రూపాయలు డబ్బు ఉంటే తెలుసున్నవారిని కూడా మీరెవరు అని అడుగుతాము. సర్వాంతర్యామి, సర్వసమర్థుడు, మన పూర్వజన్మలు, రాబోయేజన్మలు చెప్పగల సమర్థుడు అయినవాడే ఒక చేతితో జోలె, ఒక చేతిలో డబ్బా పుచ్చుకొని ఇంటింటికి వెళ్ళి బిక్ష చేసుకొన్నాడు అంటే మనం ఎంతటివారము, ఏమి చూసుకొని గర్వం తెచ్చుకొంటున్నాము. మన ఉపాధికి తగిన పనిని భగవంతుడు ఏర్పాటు చేస్తాడు. మనం ఎవరితోను పోల్చుకోకూడదు. మన గమ్యాన్ని మర్చిపోకూడదు. మనకు ఏఆలోచన వచ్చినా, ఏతలంపు వచ్చినా అది భగవదనుభవం పొందటానికి సహకరించేదిగా ఉండాలి. భగవంతుడి అనుగ్రహం లేనప్పుడు ఇహం లేదు, పరం లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-11-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పూర్వజన్మలో మీరు ఏదైనా పుణ్యం చేసారు అనుకోండి అది ఈ జన్మలో సుఖరూపంలో వస్తుంది, పాపం చేసారు అనుకోండి అది దుఃఖరూపంలో వస్తుంది. భగవంతుడి మాటనే మనం ప్రమాణంగా తీసుకోవాలి. భగవంతుడు చెప్పినట్లుగా మనం పని చేయటం వలన పుణ్యం వస్తుంది. భగవంతుడి మాటకు విరుద్ధంగా పనిచేయటం వలన పాపం వస్తుంది. భగవంతుడి మాటను ప్రమాణంగా తీసుకొని జీవించటం వలన మనస్సు నశిస్తుంది. మనం ధర్మమార్గాన్ని విడిచిపెట్టకూడదు. మేము ఏవో ట్రైనింగ్‌లు అవుతున్నాము, జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటున్నారు, అలారాదు. మీరు ధర్మాన్ని ఆచరించకపోతే మీరు ఎన్ని ఎక్సర్‌సైజులు చేసినా వాటివలన ఆరోగ్యం రావచ్చు గాని మనస్సు నశించదు, మోక్షం రాదు అది దృష్టిలో పెట్టుకోవాలి. మనం ధర్మాన్ని ఆచరించినప్పుడు తాత్కాలికంగా ఏదో నష్టపోతున్నాము అని అనిపిస్తుంది కాని మనం ఏమీ నష్టపోము, పరిణామంలో సుఖపడతాము, భగవంతుడు మన అవసరాలన్నీ తీరుస్తాడు, అంతేకాదు మోక్షం కూడా ఇస్తాడు. మనకి, రాజకీయనాయకులకు తాత్కాలికదృష్టి ఎక్కువ. ఏదో ఈ కోరిక నెరవేరిపోతే చాలు అనుకొంటాము, వారు ఎలక్షన్‌లలో నెగ్గటం చూసుకొంటారు. నిజమైన రాజకీయనాయకుడు అయితే, వాడు దేశాన్ని ప్రేమించేవాడు అయితే వాడు ప్రజలను మభ్య పెట్టకూడదు, పరిస్థితులు అర్థమయ్యేలాగ వారికి చెప్పాలి. దేశాన్ని ఎలా అభివృద్ధిలోనికి తీసుకొని వెళ్ళాలి అని వాడు చూస్తాడు కాని ఎలక్షన్‌లలో నెగ్గటం గురించి చూసుకోడు. అలాగే మన భక్తులకు కూడా ఒక ప్రణాళిక ఉండాలి, ధర్మాన్ని ఆచరిస్తూ ప్రణాళికాబద్ధంగా జీవించాలి. సహనం ఉండాలి, పట్టుదల ఉండాలి, ధర్మంయందు నమ్మకం ఉండాలి. వాడు ఏమతస్థుడైనా ధర్మమార్గానికి విరుద్ధంగా జీవించేవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. కర్మమార్గం, ధ్యానమార్గం, భక్తిమార్గం ఇవిఅన్నీ సమన్వయం చేసుకొని మన హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం అనుభవైక వేద్యం చేసుకోవాలి. దానికి మనస్సుకి నెమ్మది ఉండాలి, శాంతి ఉండాలి. మీకు ఎప్పుడైనా అశాంతి వస్తూ ఉంటే కంగారుపడకండి ఈ అశాంతి

ఎందుకు వస్తోంది అని విచారణ చేసుకొంటే అదిపోతుంది. సత్పురుషులతో సహవాసం వలన మనకు తేజస్సు కలుగుతుంది, ఆధ్యాత్మికబలం పెరుగుతుంది, ఏకాగ్రత పెరుగుతుంది, వీరత్వం కలుగుతుంది, భక్తి కూడా పెరుగుతుంది, మన కాళ్ళమీద మనం నిలబడే శక్తి వస్తుంది. భగవంతుడు మన మాటనుచూడడు, దాని వెనకాల ఉన్న తలంపును చూస్తాడు, దానిని బట్టి మనకు మనోవికాసం కలుగుతుంది. అందుచేత మంచితలంపులు వచ్చేలాగ మనం ప్రయత్నం చేసుకోవాలి.

మనస్సు అంటే అనేక తలంపుల సముదాయము. ఆ తలంపులకు అడుగున ఉన్న తలంపే నేను అనే తలంపు. ఆ నేను అనే తలంపు ఎప్పుడూ దేహంతో తాదాప్యం పొందిఉంటుంది. ఆ నేను అనే తలంపుకు దేహమే ఫుడ్‌సప్లయి చేస్తూ ఉంటుంది. ఆ నేను అనే తలంపుకు, దేహానికి ఉన్న సంబంధం తీసేసి అలా ప్రాక్టీసుచేస్తూఉంటే ఆ నేను అనే తలంపుకు ఆహారం అందక అది నశిస్తుంది. లోకంలో భిన్నత్వం ఉంది కదా మనుషులు తేడా, రంగులు తేడా, సంఘటనలు తేడా ఇదంతా బయటకు చూస్తే వేరుగా కనిపిస్తోంది. ఈ భిన్నత్వంలో ఏకత్వం చూడమని పెద్దలు చెపుతున్నారు, చూడటం ఎలాగ అని ప్రశ్న. మనం అందరము హృదయంలో సమానంగా ఉన్నాము, ఒకటిగా ఉన్నాము. లోకంలో భిన్నత్వం ఉంది. గాఢనిద్రలో అందరూ సమానంగానే ఉన్నాము. అందరి హృదయాలలో ఏ చైతన్యశక్తి అయితే ఉండి ఆడిస్తోందో అది ఒకటిగానే ఉంది. భిన్నత్వంలో ఏకత్వం చూడటం అంటే అందరిలోను చైతన్యాన్ని చూడాలి, అన్ని పరిస్థితులలో అన్ని సంఘటనలలో చైతన్యదృష్టి విడిచిపెట్టకుండా ఉండాలి. ఉన్నది ఒక్కటే, అదే చైతన్యం. అదే ఈ సృష్టికి ఆధారంగా ఉంది. ఆ చైతన్యమే జీవుడు కింద, లోకం కింద, దేవుడు కింద కనిపిస్తోంది. ఆ చైతన్యానుభవం మనకు వచ్చేవరకు పునర్జన్మలు తప్పవు, వ్యక్తిభావన మనలను విడిచిపెట్టదు. కొంతమంది మంచిపనులు చేస్తారు. మీరు ఎంత మంచిపనులు చేసారు అంటే మేము ఏమిచేసాములెండి భగవంతుడే చేసాడు అని నోటితో అంటారు కాని లోపల మేమే చేసాము అనుకొంటారు. నోటితో చెప్పింది వారికి అనుభవంలో లేదు. నోటితో చెప్పింది వాడికి అనుభవంలోఉంటే వేరుభావన పోయినట్లే. భగవంతుడు మనకు శరీరాన్ని, ఇంద్రియాలను, తెలివిని ఎందుకు ఇచ్చాడు అంటే కర్మను అనుభవించటానికి ఇచ్చాడు ఇది మనకు తెలియక అవి ఏవో గొప్పవి అని మనం అనుకొంటున్నాము, వాటిని చూసి మురిసిపోతున్నాము. ఆత్మజ్ఞానసముపార్జనకు పెట్టుబడి ఏమిటి అంటే శాంతచిత్తము, పరిశుద్ధమైన చిత్తము, పరిశుద్ధమైన బుద్ధి. భగవంతుడి అనుగ్రహం మనకు ఎప్పుడు వస్తుంది అంటే మన మాటలో, చేతలో చిత్తశుద్ధి ఉండాలి. దేవుని అనుగ్రహం వచ్చింది అనుకోండి అన్నీ వచ్చేస్తాయి, మోక్షం కూడా వచ్చేస్తుంది.

రావణాసురుడు సీతమ్మను తీసుకొనివెళుతూ ఉంటే జటాయువు అడ్డువెళుతుంది, అప్పుడు రావణాసురుడు జటాయువు యొక్క రెక్కలు నరికివేస్తాడు. తరువాత రాముడు, లక్ష్మణుడు అక్కడకు వస్తారు. రాముడికి కొన్ని వివరాలు చెప్పాక జటాయువు ప్రాణం విడిచిపెడుతుంది. రావణాసురుడికి, జటాయువుకు వ్యక్తిగతమైన ద్వేషాలు ఏమీలేవు. కాని జటాయువు ధర్మకార్యంకోసం ప్రాణాలు పోగొట్టుకొంది. రావణాసురుడు సీతమ్మను

తస్కరించినప్పడు కూడా నాకు ఇంత దుఃఖం రాలేదు, జటాయువును చూస్తే దుఃఖం వస్తోంది అంటాడు రాముడు. నువ్వు నా పనిలో చనిపోయావా అని అంటూ రాముడు చితిని పేర్చి జటాయువు శరీరానికి నిప్ప వెలిగిస్తాడు. సాక్షాత్తు భగవంతుడి చేత ఆ శరీరం దహింపబడింది. దేవుని దయ ఎలాఉంటుందో చూడండి, అప్పడు రాముడు ఏమన్నాడు అంటే యజ్ఞ దాన తపస్సులు చేసినవారు ఏ లోకానికి వెళుతున్నారో, ఉత్తమోత్తములు, మహర్షులు ఏ స్థానాన్ని పొందుతున్నారో ఓ జటాయువు నువ్వు కూడా ఆ స్థానాన్ని పొందు అన్నాడు, వాడు దేవుడు. భగవంతుడు సత్యసంకల్పుడు, ఆయన మాట జరిగిపోవలసిందే. జటాయువు తపస్సులు ఏమీ చేయలేదు యజ్ఞదాన తపస్సులు చేసిన వారు ఏలోకానికి వెళుతున్నారో నీవు కూడా ఆ లోకానికి వెళ్ళు అంటే అక్కడ యజ్ఞ దాన తపస్సుల యొక్క ఔన్నత్యం చెప్పినట్లు అయ్యింది. ధర్మాన్ని ఆచరించటంలో మనకు రాముడు ఆదర్శపురుషుడు. రావణాసురుడు చనిపోయిన తరువాత ఆ శరీరానికి శ్రాద్ధకర్మలు చేయటం అనవసరం అని రాక్షసులు అంటారు. రాముడిలో గొప్పతనం చూడండి ఆయన ఏమి చెప్పాడు అంటే మన ధర్మం మనం ఆచరించాలి వాడు ఎటువంటి వాడు అని కాదు అని చెపుతూ విభీషణుడిచేత రావణాసురుడికి శ్రాద్ధకర్మలు చేయించాడు, వాడు రాముడు.

భగవంతుడే కర్త అయినప్పడు, అంతా భగవంతుడి సంకల్పం ప్రకారం జరుగుతూ ఉంటే నాకు ఎందుకు దుఃఖం రావాలి అని ప్రశ్న. కర్త భగవంతుడే అని నోటితో అనుకొంటున్నాము, లోపల నేను కర్తను అనుకొంటున్నాడు. భగవంతుడిని మనం మోసం చేయలేము. అంతా భగవంతుడి సంకల్పం ప్రకారం జరుగుతోంది అనే అనుభవం నీకు ఉంటే నీకు దుఃఖం రాదు. కాని నువ్వు ఆపనికి కర్తను అనుకొంటున్నావు. ఆ కర్తృత్వం వలననే నీకు దుఃఖం వస్తోంది, దుఃఖం కర్తృత్వ రూపంలో ఉంది. మనకు గుడిలో ఉన్న నారాయణుడు మీద ఉన్న విశ్వాసం హృదయంలో అంతర్యామిగా ఉన్న నారాయణుడి మీద లేదు. గుడిలో ఉన్న దేవుడిని నేను అనే తలంపుపెట్టి పూజిస్తున్నాము కదా, ఈ నేను అనే తలంపు ఎంత నిజమో ఆ దేవుడు కూడా అంతే నిజం. గాఢనిద్రలో నుండి మెలకువ వచ్చేసరికి ఈ నేను అనే తలంపు వచ్చి దేహాన్ని చుట్టేస్తుంది, దేహాన్ని బట్టి లోకం, దేవుడు, పుణ్యకర్మ, పాపకర్మ ఇలాగ అంతా అడవిలోనికి వెళ్ళిపోతున్నాము. ఏ నేను వచ్చిన తరువాత మిగతావిఅన్నీ వస్తున్నాయో అది అణిగిపోతే గాని మిగతావి అన్నీ అణగవు. ఏకారణం వలన ఇవిఅన్నీ వస్తున్నాయో ఆ కారణం వేరుతో సహా నశిస్తేగాని దానివలన వచ్చేవి అన్నీ నశించవు. నీకు గాఢనిద్రలో ప్రపంచంలేదు. మనస్సు వచ్చాక ప్రపంచం వస్తోంది. నీ మనస్సులో ఉన్నదే ప్రపంచంలో కనిపిస్తోంది, నీ మనస్సులో లేనిది ప్రపంచంలో కనబడదు. అందుచేత మనస్సు నశించకుండా ప్రపంచం నశించదు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది ఎప్పడు మనకు అనుభవంలోనికి వస్తుంది అంటే మనకు ఉన్న దేహాభిమానం, రాగద్వేషములు అన్నీ నశించిన తరువాత ఆ వస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. మనకు ఎంత కాలం అయితే రాగద్వేషములు ఉన్నాయో, దేహాభిమానం ఉందో, కామక్రోధములు ఉన్నాయో అంతకాలం మనం చైతన్యానికి భిన్నంగా ఉన్నాము అని అనిపిస్తూ ఉంటుంది. చైతన్యానుభవం పొందటానికి ఏ లక్షణాలు అయితే

అడ్డువస్తున్నాయో, ఆ లక్షణాలు మనలో ఉన్నంతకాలం మనలో వేరుబుద్ధి పోదు, బ్రహ్మం రెండుగా లేదు ఉన్నది ఒక్కటే అనే అనుభవం మనకు రాదు. సత్పురుషులు కానివారితో స్నేహం చేస్తే నీవు తేజోరహితుడవు అవుతావు అని ఉపనిషత్‌లలో చెప్పారు. గురుశిష్య సంబంధం ఎలా ఉండాలి అంటే గురువుకి శిష్యుడిమీద ప్రేమ ఉండాలి, శిష్యుడికి గురువు మీద భక్తి ఉండాలి. విద్య బోధించటంలో గురువు శిష్యుడు యొక్క స్థాయికి దిగివచ్చి బోధించాలి, తనంతట వాడిగా శిష్యుడిని చేయాలి అని గురువు అనుకోవాలి, మినహాయింపులు పనికిరావు. ఇద్దరూ ఒకటిగా ఉండాలి, ఆ దేహాలు మరణించేవరకు అలాగే ఉండాలి. ఈ విచారణలు, ధ్యానాలు, సాధనలు అన్నీ అటుఉంచండి. భగవంతుడు చెప్పిన పనులు చేస్తూ, భగవంతుడు వద్దని చెప్పినవి మానివేస్తాము అనుకోండి దేహాత్మబుద్ధి పోవాలి అని అనుకోనక్కరలేదు, దానంతట అదే పోతుంది. అప్పుడు సుఖంకోసం, ఆనందం కోసం బజారులో పడనక్కరలేదు. సుఖం, శాంతి, ఆనందం వచ్చి నిన్ను వరిస్తాయి. నీ స్వస్వరూపం మీద కాకుండా సంతోషం కోసం బాహ్యవిషయాల మీద, వ్యక్తుల మీద ఆధారపడితే ఆ సంతోషం అంతా పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నాకు దుఃఖం ఎందుకు వస్తోంది అని అడుగుతున్నావు బాగానే ఉంది, నీకు దుఃఖం వచ్చినప్పుడు దేవుడు కావాలి. నీకు సుఖంగా ఉన్నప్పుడు నేను అది సాధించాను, ఇది సాధించాను, నేను గొప్పవాడిని అనుకొంటావు. భగవంతుడి దయవలననే నేను సుఖంగా ఉన్నాను అని నువ్వు అనుకోవు, అది నీ బుద్ధిలో ఉన్న దోషం. నోటితో భగవంతుడు కర్త అంటున్నావు, లోపల నేనే కర్తను అనుకొంటున్నావు. ఈ బేధం నీకు తెలుస్తోంది కదా. అన్నింటికి దేవుడే కారణం అని నువ్వు నమ్ముతూ ఉంటే, ఆ విశ్వాసం నీకుఉంటే అంతే కాదు, దాని తాలుక అనుభవం నీకు ఉంటే నీ జీవితంలో దుఃఖం రాదు, నీ ఇంటిలోనికి దుఃఖం రాదు, నీవంటిలోనికి దుఃఖం రాదు. నీ పరిసరాలకు దుఃఖం రాదు, నీవు దుఃఖరహితస్థితిని పొందుతావు.

నీ మాట, చేత, తలంపు ఒకటిగా లేవు. నీతో నీకే సమైక్యత లేదు. దేవుడితో విడిపోయి ఉన్నావు, నీతో నువ్వు విడిపోయి ఉన్నావు దీనికి నీలో ఉన్న రాగద్వేషములు, స్వార్ధచింతన, అత్యాశ ఇవన్నీ కారణం. నీవు దేవుడిలో ఉన్నప్పటికి దేవుడికి వేరుగా ఉన్నాను అనే తలంపు ఉంది, అదే కర్తృత్వం, అదే నీ దుఃఖానికి కారణం. వాళ్లను ఉద్ధరిస్తాను, వీళ్లను ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? భగవంతుడితో నీకు వేరుభావన ఎందుకు వస్తోందో ఆ వేరుభావనను తొలగించుకొని భగవంతుడి స్వరూపాన్ని పొందు. అది వదిలేసి ఎవరినో ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? ముందు నిన్ను నువ్వు ఉద్ధరించుకో. పరీక్ష వ్రాసి పాసైనప్పుడు ఎంత సంతోషం ఉంటుందో చదివేటప్పుడు కూడా అంతే సంతోషం ఉండాలి. మీరు కూర వండితే అది రుచిగా ఉంది అనుకోండి, రుచిగా ఉన్నప్పుడు ఎంత సంతోషంగా ఉంటారో ఆ పని చేసేటప్పుడు కూడా అంతే సంతోషంగా ఉండాలి. మనం చేసే పనే మనకు ప్లెజర్ ఇస్తూ ఉంటే ఫలితం ఏదో ఒకటి వస్తుంది, అప్పుడు ఫలితం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కూడా మనకు ఏమీ అనిపించదు. అలా ఉంటే నీకు శాంతచిత్తం కలుగుతుంది, మనస్సుకు వికాసం కలుగుతుంది, శక్తి పెరుగుతుంది, నీ మీద నీకు నమ్మకం పెరుగుతుంది. మనం పనిచేసేటప్పుడు

ఫలితంమీద దృష్టి పెట్టుకొని చేస్తున్నాము, దానివలన ఇహానికి పరానికి పనికిరాకుండా పోతున్నాము. మనం ఇతరులకు ఏదైనా సహాయం చేస్తున్నా నీకు నీవే చేసుకొన్నట్లు ఉండాలి. ఉన్నది ఒక్కటే. నువ్వు ఏది చేస్తున్నా ఈశ్వరభావనతో చెయ్యి, అఖండభావనతో చెయ్యి. ఈ పని నేను చేస్తున్నాను అంటావు ఆ నేను వాడకం తగ్గించు. ఆ నేను ఇంద్రియాలతో, దేహంతో, విషయాలతో కలిసి బాడిచేసుకొంటూ ఉంటుంది, అది శుద్ధమైనది కాదు. అసలు అది కోతి, కోతి సారా తాగితే ఎలా ఉంటుంది, సారా తాగాక దానిని తేలు కుడితే ఎలా ఉంటుంది, ఆ కోతి ఎలా ఉంటుందో మన మనస్సు అలా ఉంది. నువ్వు అహంభావనతో ఎవరికైనా ఉపకారం చేసినా వారు సుఖపడరు, దానివలన నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావు, లోపల కుళ్లిపోతావు. ఇక్కడ కొంత డబ్బు ఉంది అనుకోండి, ఆ డబ్బును చూసి ఎవరికి సంతోషం రాదు. ఆ డబ్బును ఎవరో ఒకరికి తీసుకొని వెళ్లమని ఇచ్చాము అనుకోండి అప్పడు ఆ డబ్బు నాది అనుకొంటాడు. నాది అనుకోవటం వలన సంతోషిస్తాడు. నేను అనేది ఒక తలంపు, దానికి నాది అనే తలంపు వస్తుంది. ఈ రెండూ అబద్దం అయినప్పటికీ ఆ తలంపు ఈ తలంపుతో కలుస్తూ ఉంటే దానికే ఇంత సంతోషం వస్తూ ఉంటే ఇంక యదార్థమైన నేను ఎంత ఆనందంగా ఉంటుందో, అసత్యమే ఇంత పొంగిపోతూ ఉంటే ఇంక సత్యం ఎంత వైభవంగా ఉంటుందో. సినిమాలో ఒకడు రాజు వేషం వేసాడు అనుకోండి, వాడికి సంతోషం వస్తుంది. వాడు నిజంగా రాజు అయితే ఇంక ఎంత సంతోషం వస్తుంది.

దుఃఖాన్ని పోగొట్టుకోవటానికి నాకు ఏదైనా ఉపాయం చెప్పండి అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఏ పదార్థములో అయితే దుఃఖం లేదో అది పొందేవరకు దుఃఖం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. శరీరం చనిపోవటం వలన దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. మన శరీరం చనిపోయినప్పడు మనకు ఉన్న వాసనలు, అలవాట్లు ఇవి అన్నీ వచ్చే జన్మకు వచ్చేస్తాయి. నీకు మంచితలంపులు రావచ్చు, చెడుతలంపులు రావచ్చు, వాటిని నీవు మర్చిపోతావు. కాని వాటి వలన ఏర్పడిన సంస్కారములు నిన్ను విడిచిపెట్టవు, వచ్చే జన్మలో కూడా నిన్ను వెంటాడతాయి, వాటికి ఏదో రోజు నీవు సమాధానం చెప్పాలి. అనుకరణ పనికిరాదు, ఇతరులతో పోల్చుకోకూడదు. మనం చొక్కా కుట్టించుకొనేటప్పడు మన చొక్కా ఆది ఇస్తాము కాని ఇతరుల చొక్కా ఆది ఇవ్వము. అలాగే మన పద్ధతిలో మనం వెళ్లాలిగాని ఇతరులతో పోల్చుకోకూడదు. అలా పోల్చుకోవటం వలన మనం నష్టపోతాము, మనకు అశాంతి వస్తుంది, దుఃఖం వస్తుంది. మనం చేసే సాధన మనకు సంతోషాన్ని ఇవ్వాలిగాని మనకు బాధను కలిగించకూడదు. బాధతో ఎంతకాలం సాధన చేయగలము. మనకు సాధనమీద ఎక్కువ ఇష్టం ఉండాలి, ఫలితం మీద దృష్టి ఉండకూడదు. మనం చేసే పని చేసుకుంటూ వెళ్లాలి. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు. పనే మనకు శక్తిని ఇవ్వాలి, పనే మనకు సంతోషాన్ని ఇవ్వాలి. మనం భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయటమే కాదు, వాటిని తొలగించమని భగవంతుడిని ప్రార్థించాలి. మనకు ఈశ్వరగతమైన జీవితం లేదు, ఎంతసేపు దేహగతమైన జీవితమే. మనం చేసే ప్రతీ పని, మన ప్రతీ మాట ఈశ్వరుడికి సంతోషం కలిగించేదిలా

ఉండాలి. ఈశ్వరుడికి మనమీద దయగలిగితే మనకు అన్నీ సమకూరతాయి. ప్రతీ సంసారానికి ఏవో చిల్లర గొడవలు ఉంటాయి. ఎందుకు పనికిరాని గొడవలన్నీ పెట్టుకొని వాటికే ప్రాముఖ్యత ఇస్తూ, వాటినే తలపెట్టుకొంటూ మన గమ్యాన్ని మర్చిపోతున్నాము. లోపలఉన్న సత్యవస్తువును పొందటానికి తగిన ప్రయత్నం చేయటం లేదు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తున్నారు అనుకోండి, కంగారుపడకండి, ఆ విమర్శించేవాడు ఎవడు, వాడు ఎట్టివాడు అని ప్రశ్నించుకోండి అప్పడు కంగారు ఆగిపోతుంది, మనస్సులో ఉన్న చాపల్యం తగ్గిపోతుంది. మన చేతికి మలం అంటుకొంటే సోపు పెట్టి, సున్నిపిండి పెట్టి తోముకొంటున్నాము మరి మన మనస్సుకు మలం పట్టుకొంది కదా, దానిని తొలగించుకోవటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తున్నాము. మనస్సులో ఉన్న మలం తొలగించుకోవటానికే సజ్జనసాంగత్యం, భగవంతుని ధ్యానించటం, భగవంతుడిని పూజించటం. మనం దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తే మలం పెరుగుతుంది. ఈశ్వరుడిని కేంద్రంగా పెట్టుకొని, ఆయన చెప్పినట్లుగా జీవిస్తూ ఉంటే మలం పూర్తిగా పోతుంది. నేను వేరు దేవుడు వేరు, నేను వేరు లోకం వేరు అని వేరుతనం తీసుకొనివచ్చేది మన మనస్సులో ఉన్న మలమే. దానిని తొలగించుకోవటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తున్నాము. ఇటువంటి ఆలోచన వదిలేసి ఏవో చిల్లరగొడవలు వేసుకొని కాలాన్ని పాడుచేసుకొంటున్నాము, ఏదో రోజున దేహం చనిపోతుంది, ఈ తుక్కును తీసుకొనివెళ్ళి స్మశానంలో పడేస్తారు. మరణానంతరం మన బంధువులు, స్నేహితులు ఎవరూ రారు, జీవుడు మన కూడా వస్తాడు, ఆ జీవుడిలో వాసనలు, సంస్కారాలు, తలంపులు మొత్తం పెంటఅంతా ఉంటుంది. ఆ పెంటను తొలగించుకోకుండా నీకు బ్రహ్మానుభవం ఎలా కలుగుతుంది.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే ఈ మబ్బులు, చినుకులు ఆగిపోయాయి అనుకో అప్పటికప్పడు సూర్యుడు ఎంత ప్రకాశంగా కనిపిస్తాడో అలాగే నీ తలంపులు, వాసనలు, కోరికలు ఒక్కసారి ప్రక్కకు తప్పకొన్నాయి అనుకో నీలోపలఉన్న జ్ఞానసూర్యుడు ఇప్పుడే ఇక్కడే ఈ శరీరం ఉండగానే నీకు దర్శనమిస్తాడు అంటున్నారు. వారు నాకు దుఃఖానికి కారణం, వీరు నాకు దుఃఖానికి కారణం అని మీరు అనుకోవద్దు. మీ దుఃఖానికి కారణం అసలు బయట లేనేలేదు, దుఃఖకారణం అంతా నీలోపలే ఉంది. నీకు చిత్తశుద్ధి ఉంటే అది నీకే తెలుస్తుంది ఎవరో ఇతరులు చెప్పనక్కరలేదు. జ్ఞానికి, అజ్ఞానికి తేడా ఏమిటి అంటే అజ్ఞాని తన తెలివితోటి, దేహం తోటి, మనస్సుతోటి తాదాప్యం పొందిఉంటాడు, జ్ఞాని ఏ వస్తువుకు అయితే మరణం లేదో ఆవస్తువుతో తాదాప్యం పొందిఉంటాడు, అందుచేత వాడికి ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. అజ్ఞానికి ఎటుచూసినా అశాంతి, దుఃఖం ఎందుచేతనంటే ఏదైతే కాదో దానితో వాడు తాదాప్యం పొందిఉంటాడు. దేహం చనిపోయినప్పడు దేహగతమైన చరిత్రపోతుంది కాని మనస్సుకు సంబంధించిన చరిత్రపోదు. మనస్సు బ్రహ్మంలో ఐక్యంఅయ్యేవరకు మనోగతమైనచరిత్ర అలా ఉంటూనే ఉంటుంది. నీబట్టకు ఏదైనా మట్టి అంటుకుంటే కంగారుపడుతున్నావు మరి నీ మనస్సుకు అంటుకుంటే దాని గురించి ఆలోచించవా? ఈబట్ట చిరిగిపోతే పోతుంది, శరీరం చనిపోతే పోతుంది కాని జీవుడు నీకూడా వస్తాడు. శరీరం చనిపోయాక నీకూడా వచ్చే జీవుడిని బాగుచేసుకోవటానికి,

వాడిని సంస్కరించుకోవటానికి, వాడిని జ్ఞానసముపార్జనకు సమాయత్తం చేయటానికి ప్రయత్నం చేయవా? భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఏ వస్తువులో అయితే దుఃఖం లేదో ఆవస్తువును పొందేవరకు నువ్వు ఏలోకంలోనికి వెళ్ళినా నిన్ను దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. ఏదో లోకానికి వెళతావు అనుకో, కొంతకాలం బాగుంటుంది తరువాత అందులో ఏమీలేదు అని తెలుస్తుంది. ఇవన్నీ మనస్సు యొక్క కల్పితాలు. మనకు అహంకారం ఉంది, జాగ్రదవస్థలో మనకు తెలుస్తోంది మరి గాఢనిద్రలో అహంకారం ఎక్కడ ఉంది? ఒక అవస్థలో ఉండి ఇంకో అవస్థలో లేనిది నిజం ఎలా అవుతుంది. ఏదో లోకానికి వెళతావు, మరల అది నిజంకాదు అని వెనక్కివస్తావు. ఇలా కాళ్ళు బాడిచేసుకోవటం, కడుక్కోవటం, ఇలా చేసిన పొరపాట్లు సవరించుకోవటంతోటే సరిపోతే ఇంక హృదయంలోనికి ఎప్పుడు వెళతావు. అందరి హృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను, ప్రారబ్ధం ననుసరించి ఆ దేహాలను ఆడిస్తున్నాను అని భగవంతుడు చెప్పాడు. మనం లోచూపు సంపాదించుకొని అక్కడకు చేరవలసిందే. అంతర్దృష్టి లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఈ దేహాలు, లోకాలు, గొప్పలు, అధికారాలు ఇవన్నీ బుడగలు, ఈ బుడగలు ఎప్పుడు పేలిపోతాయో మనకు తెలియదు. ఈ బుడగల మీదా నీ సుఖానికి, శాంతికి ఆధారపడేది అంటున్నారు. ఈ శరీరం ఇప్పుడు బాగానే ఉంది, రేపు ఎలా ఉంటుందో తెలియదు, పేలిపోవచ్చు. సముద్రంలో బుడగలు ఎంతసేపు ఉంటాయో ఈ దేహాలు, గొప్పలు, ఐశ్వర్యం అంతసేపే ఉంటుంది. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాలమీదా నీవు శాంతికోసం ఆధారపడేది. నీకు బాహ్యకారణాల వలన ఏదైనా సుఖం వచ్చినా ఇవన్నీ బుడగలు, అవి నిలబడవు. నువ్వు ఉండగా ఆ బుడగలుఅయినా పోతాయి, ఆ బుడగలు ఉండగా ఈ శరీరం అనే బుడగ అయినా పోతుంది. నీ సంతోషం కోసం ఎంతకాలం వాటిమీద ఆధారపడతావు. నీ హృదయంలోనే శాంతి ఉంది, సుఖం ఉంది, చావు ఎలా ఉంటుందో తెలియని సత్యవస్తువు ఉంది. దానిని తెలసుకోవటానికి ప్రయత్నం చెయ్యి, ఈ లోకంలోనికి మనం వచ్చిన పని అదే. దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయకుండా ఏవో చిల్లర గొడవల కోసం, స్వల్పవిషయాల కోసం సాధనను వదిలేసి నీ మనస్సును పుండు చేసుకొంటున్నావు, అక్కరలేని గొడవలలోనికి వెళ్ళి అశాంతి కొనితెచ్చుకొంటున్నావు. చిల్లరగొడవలలోనికి వెళ్ళవద్దు. ఆత్మజ్ఞానం పొందకుండా ఈ శరీరాన్ని వదిలేస్తే, నీవు ఎన్ని సాధించినా అవన్నీ బుడగలే, అవన్నీ స్వప్న సమానమే. నీకు సుఖం లేనప్పుడు, శాంతి లేనప్పుడు ఎదుటి వారికి సుఖం, శాంతి ఎలా ఇస్తావు. ముందు నీవు బాగుపడు. మనందరం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మనలను మనం సంస్కరించుకోవటం లేదు, మనం బాగుపడటానికి ఏమి ప్రయత్నం చేయటం లేదు. వాడిని ఉద్ధరిస్తాను, వీడిని ఉద్ధరిస్తాను అంటాము, ఇదొకరకమైన మాయ. నీవు అహంకారం పెట్టుకొని ఎవరిని ఉద్ధరిస్తావు? నూటికి నూరుపాళ్ళు స్వార్థం పెట్టుకొని లోకానికి ఏమి సేవ చేస్తావు. ప్రపంచంలో ఏ స్వార్థపరుడు సేవ చేయడు, ఒకవేళ సేవ చేస్తున్నట్లు కనిపించినా వీడి స్వార్థం కోసం వాడిని ఉపయోగించుకొంటాడు. అడవిలో పదిమంది కలసి వెళుతున్నారట, వెనకాల పులి తరుముకొచ్చింది అట, అందులో

ఒకడు బాగా స్వార్థపరుడు, అతను ఏమి అన్నాడు అంటే మీరు కంగారు పడవద్దు నేను కింద పడుకొంటాను, మీరు నాపైన పడుకోండి అని చెప్పాడు అంటే పులి తింటే పైన ఉన్న వారిని తినేస్తుంది, మనం బాగానే ఉండవచ్చు అని వాడి ఉద్దేశ్యం. మన తెలివి తేటలు ఇలా ఉన్నాయి. లౌకికులతో స్నేహాలు చేస్తూ ఉంటే నువ్వు ఎన్నడూ మసి అంటించుకోకుండా ఉండలేవు అని రామకృష్ణుడు చెప్పాడు.

కృష్ణుడు, కుచేలుడు కలిసి చదువుకొన్నారు. దేహప్రారబ్దాన్ని బట్టి కుచేలుడికి దారిద్ర్యం వచ్చింది, కుచేలుడు భార్య కుచేలుడితో చెపుతుంది నీవు కృష్ణుడు కలిసి చదువుకొన్నారు కదా ఆయన లక్ష్మీపతి, ఆయనే ఐశ్వర్యం, మనం ఇంత దారిద్ర్యంతో బాధపడనక్కరలేదు, కృష్ణుడిని కలుసుకోమని అంటుంది. అంత దారిద్ర్యంతో బాధపడినా నాకు దారిద్ర్యం పోవాలని కుచేలుడు భగవంతుడిని ప్రార్థించలేదు, అది కుచేలుడిలో ఉన్న గొప్పతనం. భార్య చెప్పగా చెప్పగా వెళతాను అంటాడు అప్పుడు కూడా ఎందుకు వెళతాను అంటాడు అంటే పైసాలకోసం కాదు, భగవంతుడి దర్శనం అవుతుంది అని, వాడు కుచేలుడు. కృష్ణుడి దగ్గరకి కుచేలుడు వస్తాడు, మహాత్ముల దగ్గరకి వెళ్ళేటప్పుడు పుష్పంగాని, ఫలంగాని తీసుకొనివెళ్ళాలని పెద్దలుచెపుతారు కాబట్టి భార్య అటుకులు ఇచ్చింది. ధనం ఈయన అడుగలేదు, అటుకులు ఇస్తే బాగుండదు అని ఇవ్వటం మానివేసాడు. కృష్ణుడు అది చూస్తాడు ఆయనే అటుకుల మూటను తీసుకొని తింటాడు, అటుకులు ఆయన నోటిలో పడటం, ఇక్కడ ఐశ్వర్యవంతులు అవ్వటం ఏకకాలంలో జరిగింది, వాడు భగవంతుడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మనకు నేను అనే తలంపు ఉంది, అది గాఢనిద్రలో లేదు. మెలుకువ వచ్చేసరికి దేహాన్ని చుట్టేసుకొంటోంది. నేను అనే తలంపు ఉదయించాక నాది అనే తలంపు వస్తోంది, తరువాత లోకం, దేవుడు, కష్టసుఖాలు, పుణ్య పాపాలు ఇవన్నీ వస్తున్నాయి. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో దానిని తొలగించుకోండి అన్నీ అణిగిపోతాయి. ఆ మూలతలంపు ఎవరని ప్రశ్నించుకొంటూఉంటే అది అణిగిపోతుంది, అది ఎప్పుడైతే అణిగిపోయిందో దానినిబట్టి వచ్చేగోల అంతా అణిగిపోతుంది. మరణించటాలు, పుట్టటాలు, సుఖాలు, దుఃఖాలు, లాభాలు, నష్టాలు అన్నీ మనస్సుకే, నువ్వు మనస్సువు కాదు కదా అని భగవంతుడు చెపుతున్నాడు. లోకంలో ఇన్ని గొడవలు ఉన్నాయి, ఇవన్నీ మనస్సుకే అని చెప్పి ఊరుకోవచ్చుకదా. కాని ఆయన దయ ఇక్కడ ఉంది. ఆ మనస్సువు నీవు కాదు కదా అని చెపుతున్నాడు. ఈశ్వరుడి ఋణం మనం ఎలా తీర్చుకోగలము. ఉన్నది ఒక్కటే, పరమాత్మ ఒక్కడే మరి రెండుకింద ఎందుకు కనిపిస్తోంది అంటే దానికి పరమాత్మ కారణంకాదు మనలో ఉన్న రాగద్వేషములు, మనలో ఉన్న వేరుబుద్ధి, మనలో ఉన్న స్వార్థం కారణం. నీకు ఎలా కనబడినా ఉన్నది ఒక్కటే, భగవంతుడు రెండుగా లేడు. మనం ఎవరినైనా ద్వేషిస్తూ ఉంటే మనలను మనమే ద్వేషించుకొన్నట్లు, ఎవరినైనా ప్రేమిస్తూ ఉంటే మనలను మనమే ప్రేమించుకొన్నట్లు, ఎవరికైనా ఉపకారం చేస్తూ ఉంటే మనకు మనమే ఉపకారం చేసుకొన్నట్లు, అది మనకు తెలియటం లేదు. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మం, అది మనకు అనుభవంలోనికి రావాలి.



దిll 28-10-2004 న నరసాపురంలోని సాయిబాబా గుడి
తృతీయ వార్షికోత్సవములో పాల్గొన్న సద్గురు శ్రీ నాన్నగారు




భైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి – జిన్నూరువారి ఆధ్వర్యంలో
ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ది. 16-11-04 మంగళవారం
జిన్నూరు శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో షుగర్‌వ్యాధి అవగాహన సదస్సులో
పాల్గొన్న సద్గురు శ్రీ నాన్నగారు, డాll Ch. సత్యనారాయణమూర్తి, M.S.,DGO
శాసనసభ్యులు- పాలకొల్లు, డాll P. రామమోహనరాజు, M.B.B.S. అధ్యక్షత
వహించిన గ్రామ సర్పంచ్ శ్రీమతి కలిదిండి విజయలక్ష్మి, M.A., గార్లు



శ్రీ అరుణాచలేశ్వర స్వామి వారు అపీతకుచాంబిక అమ్మవారు

తిరువన్నామలై

REGISTERED NEWS PAPER

Postage Prepaid

RNI NO. APTEL/1999/1667

**Postal Regn.No.PMG/VJ/1-3/03**

**Prepayment : Tech-31/Pre.Pmt/BMV/02**

To

301. P. Sandhya, C/o P.V.S.V.K.
Varma, D.No. 151, Rao & Raju
Colony, BanjaraHills, Road No-2,
HYDERABAD - 500034

If undelivered please return to :

**RAMANA BHASKARA**

SRI RAMANA KSHETRAM

JINNURU - 534 265. W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**

Lakshmi Modern Rice Mill, Ullamparru, Palakol - 534 265. W.G.Dt. ✆ 08814 224589, 224689

Printed at : **SHRIRAM GRAPHICS,** Bank Street, Palakol - 534 260. W.G.Dt., ✆ 222438